# ప్రచార హోరు..

- గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి జోరుగా ప్రచారం
- గులాబీ పార్టీనే మళ్లీ గెలిపించుకుంటామంటున్న ప్రజలు
- కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలంతా గులాబీ గూటికి చేరిక
- మెదక్ నియోజకవర్గ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం

# దూసుకెళ్తున్న కారు..



మెదక్: ప్రచార రథం నుంచి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతున్నది. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మెదక్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారాన్ని ప్రభంజనంలా కొనసాగిస్తున్నారు. శుక్రవారం మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేపట్టిన ప్రచారానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. బీఆర్ఎస్ పార్టీనే గెలిపించుకుంటామని ముక్తకంఠంతో భరోసా ఇస్తున్నారు.

### బీఆర్ఎస్ పార్టీకి వెల్లువలా మద్దతు...

ఏ గ్రామానికి, ఏ తండాకు వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా బీఆర్ఎస్ అభ్యర్థికి అండగా నిలిచారు. సబ్బండ వర్గాల ప్రజలు ప్రచారంలో భాగస్వాములు అవుతున్నారు. పద్మాదేవేందర్‌రెడ్డి యువతతో పాటు వృద్ధులు, మహిళలు ఇలా అందరినీ కలుస్తూ, పలుకరిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టి, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఓపికగా వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకే ఓటేయాలని కోరుతున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాల అమలుతో పాటు వెనుకబడిన మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే మా ఓటు అంటూ పద్మాదేవేందర్‌రెడ్డికి జనం నీరాజనాలు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు, రైతులు మోసపొవద్దని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఎన్నికల మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాలు, తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని పద్మాదేవేందర్‌రెడ్డి కోరుతున్నారు.

### బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..

మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలంతా బీఆర్ఎస్‌లో చేరడంతోనే మెదక్‌లో గులాబీ జెండా ఎగురడం పక్కా అని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్లడం, సబ్బండ వర్గాల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడంతో అభివృద్ధివైపే తాముంటామంటూ నియోజకవర్గ ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీకే జై కొడుతున్నారు. ఇప్పటికే కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మెదక్ నియోజకవర్గం నుంచి మైనంపల్లి రోహిత్‌ను తరిమికొట్టేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. మెదక్ నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని విమర్శిస్తున్న మైనంపల్లి రోహిత్‌కు నియోజకవర్గంలో కాలం చెల్లినట్టేనంటున్నారు. రోహిత్ మా తండాకు ప్రచారానికి వస్తే తరిమికొడుతామని గిరిజన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా వెనుకబడిన తండాలను పంచాయతీలుగా మార్చి, మా జీవితాల్లో వెలుగులు నింపిన 'ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ కే' మా ఓటంటూ ప్రజలు వెల్లువలా మద్దతిస్తున్నారు.

### చరిత్ర సృష్టించడం ఖాయం...

మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తున్నది. నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ఎన్నడూలేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ఎత్తున నిధులను విడుదల చేసింది. పలు అభివృద్ధి పనులు చేసింది. అదే అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య ప్రచార అస్త్రంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. నియోజకవర్గంలోని రామాయంపేట, నిజాంపేట, పాపన్నపేట, హవేళీఘనపూర్, చిన్నశంకరంపేట, మెదక్ మండలాల్లో ఎక్కడ ప్రచారం నిర్వహించినా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు.



చిన్నశంకరంపేట: ఎంపీటీసీ జయమ్మకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



వార్డు సభ్యుడు తీగుళ్ల శ్రీనివాస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చేగుంట జడ్పీటీసీ శ్రీనివాస్ తదితరులు

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

- రెడ్డిపల్లిలో జోరుగా బీఆర్ఎస్‌లోకి వలసలు

చేగుంట, అక్టోబర్ 27: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు చేగుంట జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ వార్డు సభ్యుడు తీగుల్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ సొసైటీ మాజీ చైర్మన్ పట్నం తానీషా, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు తీగుళ్ల వేణుగోపాల్ శర్మ, రెడ్డిపల్లి వైస్ చైర్మన్ తీగుళ్ల ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ గర్దాస్ రామారావు, సొసైటీ డైరెక్టర్లు శంభుని బాల్‌రాజు, జగతి, ముప్పిడి రాములు, రమేశ్‌తో పాటు పలువురు ఉన్నారు.



మెదక్: బైక్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, జిల్లా పోలీస్ సిబ్బంది

## పోలీసుల బైక్ ర్యాలీ

మెదక్ అర్బన్, అక్టోబర్ 27: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బోధన్ ఎక్స్ రోడ్ నుంచి వెల్‌కమ్ బోర్డ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా జిల్లాలోని పోలీస్ సిబ్బంది బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ వెంకటేశం, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, టౌన్ ఎస్ఐ పోచయ్య, పాపన్నపేట్, కొల్చారం ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుపై దాడి.. మద్యం పట్టివేత

చిలిపిచెడ్, అక్టోబర్ 27: మండలంలోని చిట్కుల్ గ్రామంలో లక్ష్మీ నర్సింహ కిరాణంషాపుపై పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 7.38 లీటర్లు మద్యం (రూ.8,118 విలువ)పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన జోగిపేట రమేశ్, షాపు యాజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

# క్షేత్రస్థాయిలో సైనికుల్లా కృషి చేయాలి

- బీఆర్ఎస్ శ్రేణులకు నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి పిలుపు
- సునీతాలక్ష్మారెడ్డికి అభినందనల వెల్లువ..

నర్సాపూర్, అక్టోబర్ 27: నర్సాపూర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి అభినందనలు తెలుపడానికి నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం నర్సాపూర్‌లోని ఆమె నివాసానికి పోటెత్తారు. బీఫామ్ అందుకున్న తర్వాత మొదటిసారి సునీతాలక్ష్మారెడ్డి నర్సాపూర్ వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఆమెను కలవడానికి పోటీపడ్డారు. నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఆమెను కలుసుకుని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ తనపై అభిమానంతో తరలివచ్చిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సైనికుల్లా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే బీఆర్ఎస్ పార్టీ విజయానికి కారణమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, నర్సింహులు, లలితానర్సింగ్, వెంకట్, షేక్ హుస్సేన్, సుధాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సత్యాగౌడ్, వంజరి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్ పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

## తనిఖీల్లో రూ.3 లక్షలు పట్టివేత

తూప్రాన్, అక్టోబర్ 27: సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3లక్షల నగదును తూప్రాన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ మార్కెట్‌లో మాసాయిపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్ రూ.3 లక్షల నగదును తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా గుర్తించారు. సరైన ఆధారాలు చూపని కారణంగా నగదును సీజ్ చేసి, రసీదును అందజేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## నేడు, రేపు నీటి సరఫరా బంద్

మెదక్ అర్బన్, అక్టోబర్ 27: సింగూరు వద్ద పైపులైన్ పగిలిన నేపథ్యంలో నేడు, రేపు (శని, ఆదివారం) మిషన్ భగీరథ నీటి సరఫరా అంతరాయం ఉంటుందని మెదక్ మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, అధికారులకు సహకరించాలని కమిషనర్ కోరారు.